మొహంమీద ఏదో పడినట్లయి ఉలిక్కిపడి కళ్లు తెరిచేడు రామ్మూర్తి.

అప్పుడే నిద్ర పట్టోందేమో, హఠాత్తుగా మెలకువొచ్చేసరికి ఒళ్లొక్కసారిగా జలదరించింది.

మొహంమీద చేత్తో తడిమేడు. తడిగా తగిలింది. వెంటనే ఏదో ఎగిరిపోయినట్లైంది. చివ్వున లేచి లైటేసి చూసేడు. చిరుకప్ప!

# కప్పలు

పిశుపాటి ఉమా మహేశ్వరమ్



చినుకుల మధ్య చంటి కుర్రాడిలా ఉత్సాహంగా ఎగురుతూ గంతులేస్తోంది. మొహంమీద తడిగా అసహ్యంగా ఉంది.

గట్టిగా తుడుచుకున్నాడు. పట్టబోతున్న నిద్రను పాడుచేసిన ఆ కప్ప పిల్లని చూసేసరికి ఒళ్లు మండిపోయింది రామ్మూర్తికి.

కాలనేసి నేలరాద్దామన్నంత కోపమొచ్చింది.

కానీ మానవత్వం అడ్డొచ్చేసరికి మర్యాదగా దాన్నవతలికి నెట్టే ఉద్దేశ్యంతో మెల్లగా 'హుష్ హుష్!' అంటూ తోలేడు.

అది అతనుద్దేశించిన తూములోకి పోకుండా పక్కనున్న పెట్టెల క్రిందికి దూరింది. ఇక మొదలైంది వేట.

వర్షాకాలం కాదు గానీ ఈ గొడవ మాత్రం రోజూ తప్పట్లేదు.

ఉన్న ఒక్క మంచం తాలూకు కోడూ విరిగి పోయింది.

కింద పడుకుంటే రాత్రి ఈ కప్పల బాధ.

ఏవరో పిల్చినట్లు అవ్నీ లోపలికొచ్చేస్తూ ఉంటాయ్. నెత్తి వెక్కి తొక్కుతూ ఉంటయ్. స్వైరవిహారం చేస్తూ ఉంటయ్.

ఒక్కదాన్ని తోలడానికి తలుపు తీస్తే పది లోపలికి దూర్తాయి. అందుకని వాటిని బుజ్జగించి, కాకాపట్టి, తూములోంచి సాగనంపి మళ్లీ రాకుండా బిరడా పెట్టెయ్యాలి. పైగా దబ్బున తోలెయ్యడం కోసం చీపురుపెట్టి తోసేస్తే పెద్దవైతే ఫర్లేదు. గానీ, చిన్నవైతే అక్కడికక్కడే చస్తాయి. కాబట్టి చేత్తో నేలమీద చిన్నగా చప్పుడు చేస్తూ వాడిని అవతలికి దాటించేయాలి.

ఈ విషయాలన్నీ మొదట అతనికి తెలీనే తెలీవు. రాధే చెప్పింది. రాధ గుర్తుకు రాగానే గురూగారి కప్పల వేట ఆగిపోయింది.

మొదటి క్షణంలో ఎలా ఉన్నవాడలాగే బొమ్మైపోయేడు.

మరుక్షణంలో తేరుకున్నాక ఇందాక కప్పమీద పడినప్పుడు (కప్పమీద అతను కాదు. కప్ప అతని మీద) ఒళ్లెంత జలదరించిందో అంతకి రెండు రెట్లు పులకరించింది. గుండెల్లోని రక్తం ఒక్కసారి పొంగింది.

వెంటనే మనసులోని కప్పరూపం చెరిగిపోయి

ఆమె రూపం ప్రత్యక్షమైంది. ఆ రూపాన్ని తలచుకోగానే మళ్లీ వో క్షణం మైకం కమ్మిందతనికి.

పెదవులతనికి తెలీకుండానే 'రా . . . ధ . . .' అన్న అక్షరాలుచ్చరించేయి మవునంగా. అప్రయత్నంగానే చతికిలబడి గోడకు జారిగిలేడు. గోడకానుకోగానే అతని దృష్టి ఎదురుగా గోడకి వేలాడదీసి ఉన్న పెళ్లి ఫోటోమీద పడింది.

ఆ ఫోటోలో తనతో సహా మిగిలిన జనాలందరూ అలుక్కుపోయి ఆమె బొమ్మ ఒక్కటే కనబడి క్రమక్రమంగా ఫోటోనంతా అలుముకుని తర్వాత గోడని కూడా ఆక్రమించేసింది.

నిద్దట్లో నడిచేవాడికి మల్లే నెమ్మదిగా లేచి ఆ ఫోటోని చేతిలోకి తీసుకుని ప్రేమగా నిమిరాడు.

ఫోటో మొత్తముమీద ఆమె ఒక్కర్తే కనిపిస్తోందతనికి. ఎంచేతో ఆమె అందం క్షణక్షణానికీ పెరిగిపోతున్నట్లనిపించింది అతనికి.

రామ్మూర్తి ఆ ఫోటోనోసారి ముద్దు పెట్టుకున్నాడు. తర్వాత గుండెలకు హత్తుకున్నాడు. ఆ తర్వాతెళ్లి రీడింగ్ టేబిల్ ముందు కుర్చీలో కూలబడ్డాడు.

టేబిల్మీద స్టీలు ఫ్రేంలో బిగించబడి ఉన్న మరో రాధ పగలబడి నవ్వుతోంది. పిచ్చిగా కవ్విస్తోంది అతన్నే చూస్తూ.

ఆ నవ్వు తన గుండెల్లో ప్రతిధ్వనిస్తూన్నట్లనిపించి ఒక్క క్షణం గుండె దగ్గరి గుండీలు సవరించుకుంటూ ఫోటోలోని రాధ కేసి చూసేడు. సూటిగా, తమకంతో, విరహంతో చూసేడు. దరిమిలా అలాగే చూస్తూండిపోయేడు.

మళ్లీ కాలివిూంచి వో కప్ప పాకేకగానీ ఈ లోకంలోకి రాలేదు. 'ఈ క్షణంలో రాధ ఇక్కడ ఉండుంటే . . .' అనుకుంది అతని మనసు.

వెంటనే ఆ తర్వాత జరిగుండాల్సిన పనిని తల్చుకుని ఒకసారి తియ్యగా మూల్గేయి అతని నరాలన్నీను.

* * *

దాదాపు నెల రోజుల క్రిందట కాపరానికొచ్చిన కొత్తల్లో ఒకనాడు ఉన్నట్లుండి తనకు తానుగా వచ్చి రామ్మూర్తిని 'హేగ్ . . ' అంటూ కావిలించేసుకుంది రాధ.

ఏదో పన్జేసుకుంటూ ఏదో లోకంలో ఉన్న రామ్మూర్తి అర్జెంటుగా ఈ లోకంలో కొచ్చేసి 'ఏవిటీ హటాత్ప్రణయం' అనుకుంటూ, అంటూ ఆశ్చర్యపడబోయేడు. కానీ రాధ అతగాణ్ణలా పడనివ్వకుండా మరింత గట్టిగా పెనవేసుకుపోయింది. 'ఏంటి సుబ్బులూ ఇలా ఒణికిపోతున్నావ్ ! ప్రేమజొరవా ? ' అన్నాడు ప్రేమగా, లాలనగా.

ఆమేం మాట్లాళ్లేదు. ఎటో సూటిగా చూస్తోంది. మనిషి కొద్దిగా ఒణుకుతోంది.

అప్పటికి పూర్తిగా ఈ లోకంలోకొచ్చిన రామ్మూర్తి ఆమె మొహంలోకి జూసేడు.విషయమేం తెలిలేదు. ఆమె చూపుల్తోపాటు తన చూపుల్ని కూడా అటువేపు తిప్పేడు. అక్కడి దృశ్యం అతణ్ణి చకితుణ్ణి చేసింది.

వెంటనే లారెలెన్డ్హార్డీ పిక్చర్ చూస్తున్నట్లుగా పెద్ద పెట్టున నవ్వసాగాడు.

ఆ నవ్వుతో తన ఉనికిని తెలుసుకున్న రాధ కొద్దిగా పట్టువిడుస్తూ 'ఏంటండీ ఆ నవ్వు . . మరీనూ. . . వో పక్కనేను భయంతో చస్తూంటే' . . అన్నది.

తెరలు తెరలుగా వస్తూన్న నవ్వు నాపకండానే అర్ధాంగివేపోకసారి జాలిగా జూసి ఆ తర్వాత హిరోయిన్ మీదికి దూకబోయే విలన్లా, క్రూరంగా బలిష్టంగా మూంచి వూప్మీదున్న 'కప్ప' వంక జూసేడు రామ్మూర్తి.

'వెరీ ఫైన్ . . సుపర్బ్ . . . మార్వెలస్ . . . కప్పల్లో ఈ సైజున్నూడ్డం యిదే మొదలు. యిటువంటిది గనుక డిసెక్షన్కి దొరికిందా చూస్కో . . .'

'మీ మేస్టారు బుద్ధిపోనిచ్చుకున్నారుగాదు. ముందు దాన్ని తగిలెయ్యండీ. నావంకే మిర్రి మిర్రి చూస్తోందీ . . .'

'బహుశా మగ కప్పై ఉంటుంది రేణూ కప్పల్లోగూడా ఇంత టేస్టు గలవి ఉంటాయని ఇవేళ్లే తెల్సింది. మరి నీ అందం. . .'

'అబ్బబ్బ మీజోకులాపండి బాబూ . . . నా ప్రాణాలు పోతుంటేనూ . . . ముందు దాన్ని తగిలెయ్యండీ . . . ప్లీజు . . ! '

ఆమె నిజంగా జడుసుకున్నట్లు ఆమె గుండె చప్పుడే చెప్తోందతనికి. మొదటిసారిగా ఆమెలోని వీక్సైడేదో అర్ధమైందతనికి. దానికితోడు భయముతో ఆమె అంతకంతకీ హత్తుకుపోతూంటే మరింత ముచ్చటేసింది. అంచేత గురూగారు మరికాస్త ఉత్సాహం పుంజుకున్నాడు.

'ఎలా తోలను సుశీ ! నిన్ను నన్నింత దగ్గరకు జేర్చిందే! ఉపకారికి నపకారము జేయుట పాడియా...'

రాధకి కళ్లల్లో నీళ్లు తిరిగేయి.

'నాకివతల ప్రాణాలెగిరిపోతూంటే మీకు నవ్వులాటగా ఉంది గదూ . . . ' ముంచుకు రాబోయిన ఏడుపుతో ఆమె గొంతు పూడుకుపోయింది.

---

"రామారావుగారూ, మా బాం క్ లో డబ్బు వెయ్యరాదూ ?" అని ఏ జెం టు అడిగాడు ఒకరోజు.

"ఎందుకండీ బాంకు, మా ఇంట్లో ఒక పెట్లో వేసేసుకుంటూ ఉంటాకదా ?" అన్నాడు రా. రా.

"వడ్డీసంగతి మరిచిపోయినట్లున్నారు," అన్నాడు బాం. ఏ.

"అదీ వేసుకుంటూ ఉంటాలెండి ఫరవా లేదు," అని సర్దేశాడు. రా. రా.

---

ఆమె కళ్లల్లో నీళ్లు చూసిన రామ్మూర్తి వెంటనే గుర్రం దిగేసేడు.

'చ ! చ ! నవ్వులాట్లకన్నాను సరూ ! ఈ మాత్రానకే కన్నీళ్లా ! అయినా చిన్న పిల్లలాగ కప్పలంటే భయమేమిటీ . . . ఉండు తోలేస్తాను' అంటూ ఆమెనుండి ఒదిలించుకుని కప్పవేపు వో కాలు విసిరేస్తూ 'చప్' అన్నాడు.

అది అదరలేదు. బెదరలేదు. అంగుళం గూడా కదల్లేదు.

రాధమ్మ రామ్మూర్తి వెనకాల నక్కింది.

అతను మళ్లీ ప్రయత్నించేడు.

అతనెంత అదిలించినా అటు ఇటూ తప్పించుకు తిరిగిందే తప్ప వో పట్టాన బైటికి పోలేం.

ఆ విధంగా భార్యామణి భయంతో వేపే కేకల బ్యాగ్రౌండ్ మ్యూజిక్ సహాయంతో నాలుగైదు నిముషాలు దానితో వీరోచితంగా పోరాడి ఎట్టకేలకు దాన్ని ఒడుపుగా పట్టుకున్నాడు.

రాధ ప్రాణం గిలాగిల్లాడిపోయింది.

'అయ్యొయ్యో అవేం భ్రష్టప్పంన్లండీ . . . కప్పల్ని చేత్తో ముట్టుకోడవేమిటండీ బాబూ . . . ఒదిలెయ్యండీ దాన్ని . . . . మిమ్మల్నేనండీ . . .'

పొగరుబోతు కోడె తాచుని పిడికిట్లో బిగించినంత గర్వంగా జూసేడు, రామ్మూర్తి రాధ వంక.

ఆమె అగ్గగ్గలాడిపోతోంది వదిలెయ్యమని.

'కాదు వరం ! నే జెప్పేది విను . . . వో ఖాళీ డబ్బా ఉంటే చూడు . . . రేప్పొద్దున స్కూలికి తీస్కెడతాను . . .'

'ఇవేం మతిలేని పన్లురా దేముడా . . . మీరు కప్పల్ని పట్టి స్కూలికి తీస్కెళ్లే ఖర్మేమిటండీ బాబూ. ముందు దాన్ని బయట పారేసి రండి . . . నాకు డోకొచ్చేట్టుగా ఉందీ . . . '

'ఏం గిరాకీ ? వేవిళ్లా బేబీ ?"

'దేముడా రాముడా' అంటూ నెత్తికొట్టుకుంది రాధమ్మ.

కొంతసేపలా ఏడిపించాక అవతల పారేయడానికొప్పుకున్నాడు. పారేయబోయే ముందు మీదికి విసుర్తున్నట్లు నటించి జడిపిద్దామనిపించింది గాని ఆమె వాలకం జూస్తే జడుపు జ్వరం వచ్చేటట్లుగా అనిపించి ముచ్చటపడుతూన్న మనసు మీద ముసుగేసి బయటకు నడిచేడు.

పారేసి చేతులు కడుక్కొచ్చేక శత్రు సంహారమొనర్చివచ్చిన రాకుమారుడన్నంత ఆరాధనా భావంతో మనసారా, కృతజ్ఞతాపూర్వకంగా మరోసారి కౌగిలించుగుంది రాధ.

ఆ సమయంలో ఆమె చుబుకాన్ని పైకెత్తుతూ రామ్మూర్తి ఇలా అడిగేడు.

'కప్పలంటే నీకెందుకింత భయం కమలా ?'

'నాకు తెలీదు. కానీ దాని పేరంటేనే అసహ్యం. దాని కంఠం రూపం మరీ అసహ్యం. భయం. అంతకన్నా నాకంకేమీ తెలేదు. కప్పని చూపించి మాత్రం నన్ను జడిపించడానికి ప్రయత్నించకండి.

చికాకు పుణ్యముంటుంది. నేను భరించలేను' అన్నది రాధ అతని హృదయంలో తల దాచుకుంటూ.

'ఈ విశాల సృష్టిలోని ఏ జీవరాసినీ చిన్న చూపు చూడరాదు కాంతం ! అన్నిటినీ సమాన దృష్టితో చూడ్డం నేర్చుకో.

'కప్పలో ఏం లోపం కనపడింది నీకు. అందమంటావా ? దాని అందం దానిదీ, కంఠం అంటావా ? కొందరి కంఠాలు ఒకేసారి సప్త స్వరాలూ పలికిస్తూ కర్ణ కఠోరంగా ఉంటాయి గదా ! అటువంటప్పుడు దాని సంగతి ఒక ఆలోచించాల్సిన విషయమా ? కాదు. భాగ్యం కాదు. కాదెంత మాత్రంకాదు. కప్పని నువ్వు తప్పుగా అర్థం చేసుకుంటున్నావు. అర్థం జేసుకొనేవాడి కదెంత వేదాంతాన్నైనా బోధిస్తుంది తెల్సా. కప్ప గొప్పతనం చెప్పాలంటే బోలెడుంది.

సర్దుకుపోయే గుణం అసలు మనం దాం దగ్గరే నేర్చుకోవాలి. నేలమీదైనా, నీటిలోనైనా, ఆఖరికి వో నల్లరాతి బండలోనైనా అది ఒకే రకంగా జీవిస్తుంది. మనమో ! కరెంట్ లేక ఫాన్ ఆగిపోతే ఆ రాత్రికి నిద్రబోలేం.

మిత భాషణం గూడా మనం దాం దగ్గర్నుంచే నేర్చుకోవాలి. ఎంతో అవసరమైతేనేగానీ దాని నోట్లోంచి శబ్దంరాదు. మనం అవసరమున్నా లేకపోయినా నాలిక్కి నరం లేదు గదాని, నొప్పెట్టదుగదాని బడా బడా వాగేస్తుంటాం. అలా కాదు అనవసరంగా పోచికోలు కబుర్లతో కాలహరణం చెయ్యకుండా, అవసరమైనప్పుడే, అదైనా మితంగా మాట్లాడమని మనకు చెప్తుంది.

గమనించేవో లేదో, దాని చూపెప్పుడూ పైకే ఉంటుంది. కిందికసలు చూడనే చూడదు. దాని సందేశమేమిటో తెల్సా. వో మానవుడా ! పామరుడా ! నేలబారు చూపులతో నీ భవిష్యత్తు పాడుజేసోకు. ఎప్పుడూ నాకు మల్లే పైకి చూస్తూ పైపైకి పోడానికి ప్రయత్నించు అవి. పైకి అంటే ఎక్కడికి. 'పరమపదానికి. నిజమంతేకదా ! మనిషన్నవాడెప్పుడూ పైకి పోడానికే ప్రయత్నించాలి. నేనీ మేస్టరు గిరీ నుంచి లెక్చరరూ, తర్వాత ప్రొఫెసరూ, వీలైతే ప్రిన్సిపాలూ అవుదామని చూస్తున్నానా లేదా. అదన్నమాట! విషయం.

పైగా ఏపన్జేసినా హడావుడి చెయ్యొద్దంటుంది

## కప్పలు

కప్ప. అది చూడు. ఏ జీవినైనా అమాంతం సజీవంగా మింగేసినా, అంత పనినీ కళ్ళు మూసుకుని కామ్‌గా చేసేస్తుంది. మనమో ! అర్భాటం, హంగామా చెయ్యకుండా ఏ పనిచెయ్యం. అసలు సరుకున్నవాళ్ళు ప్రతి పనినీ కామ్‌గా చేసుకుపోతారు.

నువ్వు పన్జెయ్యకుండా నీరసంగా కూర్చున్నావంటే కాలం నీకోసం ఆగదు. పైగా మృత్యువు నీ వెనకాల తరుముకొస్తోంది. కాబట్టి దోవలోని అడ్డంకుల్ని లెక్కజెయ్యకుండా నాకు మల్లే ముందుకు దూకుతూ పో అని కప్ప సలహా.

ఇవన్నీగాక వో లలనామణీ ! రమణీ ! రమామణీ ! అన్నిటికన్నా ముఖ్యమైన విషయం వొకటుంది. అది వింటే కప్పంత నిస్వార్థ జీవి మరోటిలేదని నువ్వు ఒప్పుగోడం కాకండా నంట మానేసి మరీ పనిగట్టుకుని లోకాని కెలుగెత్తి చాటుతావు. కాబట్టి జాగ్రత్తగా విను. జంతుశాస్త్ర విద్యార్థులు జంతు శరీర నిర్మాణం గురించి తెలుసుకోడం కోసం తన జీవితాన్నే తృణప్రాయంగా త్యాగం జేసేస్తుంది కప్ప. జువాలజీ లేదా మెడికోలు ముందు కప్పని కోయడంతో మొదలెట్టేగదా మనుషుల్ని కోయడంలో ఆపుజేస్తారు. చచ్చిపోయేక ఎవడేనా తన శవాన్ని కోసి ముక్కల్జేసి పెడ్తానన్నాడనుకోండి అందుకు చచ్చినా ఒప్పుగోడే మనిషి. కాని కప్పలలాకాదు. పరోపకారం కోసం ప్రాణాల్నిగూడా లెక్కజెయ్యవు.

ఇప్పుడు జెప్పు జలజా ! మానవ జీవితాలకింత మహోపకారం జేసే కప్పల్ని అసహ్యించుకుంటావా ! నీకిది న్యాయమేనా . . ధర్మమేనా . .

న్యాయం యిదియేనా ?

ధర్మం యిదియేనా ?

ఏలా యీ ద్వేషం ? . . . అంటూ మాండూక్యోపనిషత్‌లో కొంత భాగం వినిపించి చివరకో పాటగూడా పాడి బెటర్ హాఫ్ బుద్ధి మార్చడానికి ప్రయత్నించాడు రామ్మూర్తి.

పోన్లే పాపం ఎంతయినా మొగుడు గదా అని యిష్టం లేకపోయినా అతని మొహంలో శ్రద్ధగా కప్పమైన కళ్ళవంక చూస్తూ అతన్జెప్పినదంతా

శ్రద్ధగా విన్నట్లు నటిస్తూన్న రాధ అతను చెప్పడం ఆపేసి ఆయాసపడ్తూన్న తరుణంలో యిలా అన్నది.

'కప్పలంటే మీకంత సింపతీ ఉంటే 'ఫ్రాగ్ ఫిలాసఫీ' అనో హెడ్డింగ్ పెట్టి మీ కోపికున్నన్ని కాగితాలు ఖరాబు జేస్కుని ఏ యూనివర్సిటీకన్నా పంపించి వో దణ్ణమెట్టుగోండి. అంతేగానీ నన్ను మార్చడానికి ప్రయత్నించకండి. ఈ విషయానికింతటితో ఫుల్‌స్టాప్ పెట్టేయండి !'

కానీ ఆ ప్రకరణం అంతటితో ముగిసిపోలేదు. రామ్మూర్తికీ ఆట బాగా నచ్చింది. అందుచేత అడపాదడపా రాధకి తెలీకుండా ఇంట్లో కప్పల్ని తెచ్చి పెట్టి 'పాహిమాం ప్రభో' అంటూ ఆమెంతటామే తన దగ్గరికొచ్చేట్లు చేస్కోడం మొదలెట్టేడు. ఈ నాటకాన్ని కొన్నాళ్లామెనమ్మింది గానీ గుట్టు రట్టైపోయేక గట్టిగా వార్నింగిచ్చేసింది.

కానీ రామ్మూర్తి జడిసిపోలేదు. కాళ్ల బేరానికి రాలేదు. పైపెచ్చు విలాసంగా నవ్వేడు. అలానవ్వడం పూర్తయేక ఇలా అన్నాడు.

'నే కప్పల్నొదల్డం కల్ల కప్ప నా కప్ప' (నాకు అప్ప అని పాఠాంతరము) అంతేగాక మా అప్ప నిన్ను దెచ్చి నాకు పెళ్లి జేసింది. కాని యీ కప్పలు నిన్నూ నన్నూ మాటిమాటికీ కల్పుతున్నాయి. వాటి రుణం వెయ్యి జన్మలగ్గూడా దీర్చుకోలేను' అన్నాడు కవ్వింపుగా.

విషయమేవిటంటే రామ్మూర్తికీ సంబంధం వాళ్లక్కగారు దీస్కొచ్చింది.

రాధ కప్పలంటే భయపడుతున్నకొద్దీ దాన్ని చూసి ఆనందించడం అనే 'సింపిల్' ఇంట్రస్ట్ కాంపౌండ్ ఇంటరెస్ట్‌గా మారసాగింది రామ్మూర్తిలో.

కానీ దురదృష్టంకొద్దీ కప్పలెదురైనప్పుడల్లా అతనాశించిన సంఘటనలే ఎదురవలేదు.

వోసారి దొడ్లోంచి వో బకెట్ నీళ్ళు తోడుపడ్తూండగా కప్ప వొకటి ఎదురు రాబోతోందన్న భయంతో బకెట్‌ని చటుక్కున వదిలేసింది రాధ.

అది మాటిగా రామ్మూర్తి కాళ్లమీద పడి చిటికెన వేలు కాస్తా చితికిపోయింది.

ఆ క్షణంలో రామ్మూర్తికి ఒళ్ళు తెలీలేదు.

పూచి పుచ్చుగు నొక్కు లెంపకాయ కొట్టేడు. చిటికెన వేలి నుండి రక్తం కారినట్లు ఆమె కళ్ల నుండి బొట బొటా కన్నీళ్లు రాలేయి.

పచ్చని, పల్చని, నున్నని, మెత్తని లేత చెక్కిలి మీద అతని వేళ్ల గుర్తులు మూడ్రోజులు వరకూ కనబడ్తూనే ఉన్నాయి.

మరోసారి ఇద్దరూ కలిసి రాత్రిపూట భోంచేస్తున్నారు.

వర్షాకాలం !

రాత్రైతే ఇంట్లోకి కప్పలొస్తాయన్న భయముతో చీకటిపడకముందే భోజనాలు ముగించేసి తలుపులు మూసుకునే పద్ధతి పెట్టింది రాధ.

కానీ ఆవేళ సినిమాకెళ్లడం మూలాన అర్ధరాత్రి భోజనాలకూర్చోవడం జరిగింది. భయ



కొత్త సీరియల్

## అతకని అనుబంధాలు

త్వరలో ప్రారంభం!




## కప్పలు

పడుతున్నట్టుగానే భోజనాలు సగంలో ఉండగా వో కప్ప రానే వచ్చింది.

రాధ భయంతో రామ్మూర్తి దగ్గరగా జరుగుతూ 'కొట్టండీ . . . దాన్ని కొట్టెయ్యండీ' అంది ఒణికే స్వరంతో.

రామ్మూర్తి దాన్ని తరుముతున్నట్లు నటిస్తూనే ఆమెమీదికి పంపే ప్రయత్నాలు చేయ సాగేడు.

అది గమనించిన రాధ మరింత బిగుసుకుపోతూ అతని చెయ్యి గట్టిగా పట్టుకుని తనకి తెలీకండానే కండ వూడి వచ్చేట్టు గిల్లేసింది.

దాంతో నవ్వులాటల మూడ్‌నించి బయట పడ్డ రామ్మూర్తిలోని కోపం తారస్థాయినందుకుంది.

'ఏమిటా గిల్లేడం? మనిషి ననుకున్నావా, మట్టి బొమ్మననుకున్నావా? కప్పనూడగానే నిన్ను నువ్వు కంట్రోలు జేస్కోమని సవాలక్ష సార్లు చేప్పేను బుద్ధుందా . . .' అంటూ హంతెత్తున ఎగిరిపడ్డాడు.

రాధ నిజంగానే ఏడ్చేసింది.

'నేను మీకు ముందుగా చెప్పేను. కప్పంటే నాకు భయమని. అయినా నన్నెందుకేడిపిస్తున్నారు. మీరు చేసే పనులు మీకు బానే ఉంటాయి. మీకు గిల్లితేనే అంత బాధ కలిగిందే అంటూ కంట నీరెట్టుకుని సగంలో లేచిపోయి చేయి కడుక్కుంది. మరోసారి స్కూల్‌నించి వస్తూ చెక్కతో చేసిన చిన్న మందిరం తీస్కొచ్చాడు రామ్మూర్తి.

అంతకుముందు వారం రోజుల్నించీ ఇంటో మ్రోగుతూనే ఉన్నాడు. హెడ్మాస్టరింట్లో వో సరస్వతీ మందిరం చూసేననీ, చాలా బాగుందనీ, అటువంటిదే తను గూడా వొటి చేయిస్తాననీను.

ఆవేళ ప్రొద్దున్నే స్కూలికి వెళ్లేటప్పుడు చెప్పేడు సాయంత్రం సరస్వతీ మందిరం తెస్తానని. వస్తూనే ఆ మందిరాన్ని తీసుగెళ్లి పుస్తకాల అల్మైరాలో పెట్టేడు.

చూడ్డానికి చాలా బాగుందది. రాధగ్గూడా నచ్చింది.

'బాగుందండీ, విగ్రహం కూడా కొన్నారా' అంది చూడ్డానికి దగ్గరకెడుతూ.

'ఆ! లోపలుంది చూడు. ఏమనుకున్నావో మన సెలెక్షన్ చూసి డంగైపోతావ్' అన్నాడు రామ్మూర్తి తెల్లె విప్పుకుంటూ.

తెరచి చూడగానే రాధ నిజంగానే డంగైపోయింది.

తలుపులు సగం తెరిచీ తెరవగానే ధన్‌మంటూ వో కప్ప ఎగిరొచ్చి మీద పడ్డం, కెవ్వుమంటూ అరిచి వెనకేఉన్న రామ్మూర్తిని భయంతో కరుచుకుపోవడం ఒకసారే జరిగాయి.

[ముగింపు పై వారం]

# కప్పలు

పిశపాటి
ఉమామహేశ్వరమ్

(గత సంచిక తరువాయి)

ఆ పట్టు పట్టు జడుపు జ్వరం వచ్చి నాల్రోజులపాటు మంచంమీద నుండి లేవలేకపోయింది రాధమ్మ.

ఆ నాల్రోజులూ నిద్రాహారాల్లేకండా పక్కనే ఉండి పరిచర్యల్జేసేడు రామ్మూర్తి. ఆమెకి రెండో రోజు కొద్ది తెలివి వచ్చి మన లోకంలో పడగానే మొదటిసారిగా, మనఃపూర్వకంగా ఆమెను ఆమె పేరుతోనే పిలుస్తూ "నన్ను క్షమించు రాధా! ఇంకెప్పుడూ యిటువంటి మోటు సరసాలాడను. నన్ను క్షమించు' అన్నాడు.

ఆ తర్వాత అతనెప్పుడూ ఆమె ముందు కప్పల విషయం ఎత్తలేదు. కనీసం జువాలజీ పుస్తకం కూడా తెరవలేదు.

టేబిల్మీది ఫొటోలోని రాధ మొహంలోకి చూస్తుంటే జరిగిన సంఘటనలన్నీ మనసులో తిరిగేయి రామ్మూర్తికి.

కప్పని చూసినప్పుడల్లా అతనికి రాధ గుర్తొస్తుంది.

ఇవేళ మరీను.

కారణం ఆమె పుట్టింటో ఉండడం.

మనసు నిండా ఆమె రూపే నిండింది.

శరీరంలోని ప్రతి అణువూ ఆమె సాన్నిధ్యాన్ని కోరసాగింది.

మెదడు నిండా ఆమెను గురించిన ఆలోచనలే. తామిద్దరూ కలిసి యుగాల్ని క్షణాలుగా గడిపిన జ్ఞాపకాలే.

విరహం కలిగిస్తూన్న తీయని బాధకతడు తట్టుకోలేక కుర్చీలో యిబ్బందిగా కదిలేడు.

రాధ కావాలి అంటోంది అణువణువూను.

మరు నిముషంలో అతనికి అమ్మమీదా, మామగారి మీదా, ఆచార వ్యవహారాల మీదా బోల్డు కోపం వచ్చేసింది.

రెండు నెలల క్రితం పెళ్ళి అయ్యి, కాపురం పెట్టిన కొత్త జంటను ఒంటరిగా బతకనీక మధ్య ఈవిడెందుకు. ఆ వుండేదేదో మొదట్నించీ ఉండక యిన్నాళ్ళు నించీ అన్నయ్య దగ్గర ఉన్నది వారం క్రితమే ఎందుకు రావాలి?

ఆవిడ వచ్చిన నాలుగు రోజులకే ఏదో ఆషాఢ మాసం గూడా వచ్చిందిట.

ఆషాఢమాసంలో, అత్తలూ, అల్లుళ్ళూ, కోడళ్ళూ ఒకరి కంట ఒకరు పడకూడద్నా అవటా అన్జెప్పి ఆ రూల్స్ ఎన్డ రెగ్యులేషన్స్ వో అరగంటసేపు వివరించి మొన్ననే వాళ్ళ నాన్నగారు చేతిలో రెండొందలు పెట్టి బట్టలు కుట్టించుకోమ్మా బాబ్జీ నెల కాంగానే పంపిస్తాగా అమ్మాయినీ అంటూ రాధన్తీస్కెళ్ళి పోయేడు.

పోనీ రాధెళ్ళిపోయేక ఈవిడేనా యిక్కడుండ గలిగిందా అంటే అదీ లేదు. మొన్న రాధవెళ్ళి పోగానే నిన్ననిటు పెద్దన్నయ్యొచ్చి 'లక్ష్మి పెద్దమనిషైంది అమ్మా' అన్చెప్పి అమ్మని తీస్కెళ్ళి పోయేడు.

ఆ లక్ష్మైనా వో మూడ్రోజులు ముందు బయట జేరివుండి వుంటే తనిద్దరికీ చెడి చెయ్యి కాల్చుకోవాల్సిన గతి తప్పేది కదా!

వేయేల! అంతా విధి ఘటన అనుకుంటూ కూర్చున్నాడు రామ్మూర్తి.

అతనికి నిద్ర రావడం లేదు.

చాలా చికాగ్గా వుంది మనసు.

రాత్రి ఒంటి గంట దాటింది.

చుట్టు ప్రక్కల యిళ్ళలో అందరూ ఆదమరచి నిద్రబోతున్నారు.

ఒక్క రామ్మూర్తి యింట్లోనే లైటు వెలుగుతోంది.

బయట సన్నగా చినుకులు పడుతున్నాయి.

ఇంటి ముందు ఖాళీ స్థలంలో నిలిచిన వర్షం నీటిలో జేరిన కప్పలు టీచర్లేని క్లాసులోని విద్యార్థుల్లా ఒహాటే రణగొణధ్వని చేస్తున్నాయి.

ఆడ కప్ప లవసరం కలిగినప్పుడు మొగ కప్పలలా అరుస్తాయిట. తన మనసు పెడుతున్న గోలకీ, ఆ గోలకీ ఆట్టే తేడా కన్పించలేదతనికి.

అర్ధాంగిని గూర్చి ఆలోచనల్తో అతనికి నిద్ర రావడం లేదు.

మర్నాడు మళ్లీ స్కూలుకెళ్ళాలి, నిద్ర లేకపోతే కష్టం అన్జెప్పి చివరికి లైటార్ప్ జేసి పక్కమీదికి జేరేడు గానీ, లాబ్ ప్యూన్ 'వేంకప్ప'ని అలా పిలవలేక వెంకయ్య అని పిల్చే ఆమె బేలతనమూ, నూతిలో నీళ్ళు తోడితే కప్పలొస్తాయన్న భయంతో తనచేత తోడించే పిరికితనమూ, ఈ విషయాల్లో తప్ప మిగతా విషయాల్లోని ఆమె చురుకుతనమూ, పెంకె దనమూ, కళ్ళ ముందు నాట్యమాడసాగేయి.

అలాగే పక్కమీద దొర్లుతూండగా ఎప్పుడో తెలవారతూండగా పట్టిన కలత నిద్దట్లో గూడా అతనికి కప్పలమీదే కలలొచ్చేయి.

అతని మనస్సే మానస సరోవరంగా మారింది. అటువేపు తనూ, రాధా విహారానికెళ్ళి, ప్రణయ గీతాలు పాడుకుంటూంటే ఆ సరోవరంలోని కప్పలు బ్యాక్గ్రౌండ్ మ్యూజిక్ సప్లై చేశేయి. ఆ తర్వాత వాళ్ళిద్దరూ అందులో నౌకా విహారం జేస్తుంటే ఒక్కొక్క కప్పా చూస్తుండగానే మనిషంతెత్తెదిగి పోయి ఆమెనెత్తుకు పోడానికి ప్రయత్నిస్తే అతను వీరోచితంగా పోరాడేడు. ఒక్కొక్క కప్పనీ చంపేక ఆశ్చర్యం. . అవన్నీ కప్పలు కావు. . . రాధకి బోలెడంత మంది మేనత్త కొడుకులున్నారు. . వాళ్ళు తమ తమ నిజరూపాల్తో నేలరాలి పోయేరు.

ఈ విధమైన కలల్తో రాత్రి సగం సగం నిద్ర బోడం మూలాన రామ్మూర్తి తెల్లారి లేచేసరికి తొమ్మిదైంది.

పదింటికల్లా స్కూలికెళ్ళి పోవాలన్న సంగతి గుర్తుకొచ్చేసరికి పాముచే తరమ బడుతూన్న కప్పలా చకచకా పరుగులెత్తుతూ పనికానిచ్చుగుని ఎంత ఆదరాబాదరాగా పరిగెట్టినా టైముకందుకోలేక బోయేడు.

అప్పటికే స్టాఫ్ ఎటెండెన్స్ రిజిస్టర్ హెడ్మాస్టర్ రూంలో కెళ్లిపోయింది.

అంచేత ఎంతో పొంచి పొంచి మీదికి దూకినా గానీ ఎర అందని కప్పలా ఆయన ముందు నిల్చోక తప్పలేదు. దానికి తోడు ఆయన ఎరని మింగబోయే కప్పలా చూడ్డం అతని కాళ్లలో మరింత ఒణుకు పుట్టించింది.

అసలే ఆయనింటి పేరు కప్పగంతులవారు. గోధుమరంగు గళ్ళ కోటేసుక్కుని చేతిలో బెత్తం పుచ్చుకుని ఆయన నడుస్తూంటే అచ్చు కప్ప గెంతుతూన్నట్టే ఉంటుంది.

దానికి తగ్గట్టు ఆయన చూపు, మాట తీరు గూడా అంతే.

కొంచెం మెల్లు, ఆ పైన చత్వారం కావటం మూలంగా మాటి మాటికీ కళ్ళజోడులోంచి పైకి చూస్తూ మాట్లాడతాడు.

ఇక మాట సంగతి సరేసరి. తొందర్తొందరగా



మాట్టాడ్డం మూలాన మాట పూర్తి జేసేలోప పదిహేను కప్పదాట్లు తప్పవు.

రామ్మూర్తిని చూస్తూనే ఆయనిలా అన్నాడు.

'య్యేమయ్యా. . . రామ్మూర్తీ. . బడికిపుడా.. త్తెల్లారిందా. . . టైమెంతో. . ! '

ఆయనది టెలిగ్రాఫిక్ భాష. సగంలో ఆపే స్తాడు. మాట్టాల్లేక.

మిగతాది ఎదుటి వాళ్ళు అర్థం చేసోక్కవాలి.

ఆర్స్యా చేస్తే మరింత రెచ్చి పోయే ఆయన స్వభావం తెల్సున్నవాడు గాబట్టి క్లుప్తంగా 'క్షమించండ్సార్. . ఆలీసెమై పోయింది. . వాటి దుంపతెగ... ఆ చామదుంప లో పట్టానవేగి చావలేద్సార్ . . ! ' అన్నాడు తలొంచుకుని.

ఆయనకి 'చామదుంపలంటే యిష్టం'

అంతే! రామ్మూర్తి పాచిక బ్రహ్మాండంగా పారింది

'పూ. . స్సర్లే. . ప్పో. . ముందాక్లాసుకి. . . టూపు లేపేస్తున్నారు. . కోతి వెధవలు'

మరు క్షణంలో పాము నోటి నుండి తప్పించుగున్న కప్పలా బైటపడ్డాడు రామ్మూర్తి.

సూటిగా తన క్లాసువేపెళ్ళ బోతూంటే సైన్స్ క్లాసులోంచి తెలుగు మాస్టారైన పట్టాభిరామయ్య గారి కంఠం వినిపించింది.

పాఠం మధ్యలో ఏదో ఉదాహరిస్తూ. . కప్పలు వది వేలు జేరుగదరా సుమతీ! అంటూ పద్యం పూర్తి జేసేవేళకి రామ్మూర్తి తన క్లాసు ముందునించి పోతూంటే చూసి భావగర్భితంగా నవ్వేరాయన.

రామ్మూర్తికీ, కప్పలకీ ఉన్న సంబంధం, అనుబంధం ఆయనకు తెల్సును.

రామ్మూర్తి సిగ్గుపడి మరింత చురుగ్గా అడుగేస్తూ తన క్లాసులోకెళ్ళి పడ్డాడు.

నిజంగానే టూపు లేపేస్తున్నారు కుర్రాళ్ళు.

చెవులు బద్దలు చేసే ఆ గోల భరించలేకవెడ్తూనే 'సైలెన్స్' అంటూ గద్దించి అందరి నోళ్ళకి తాళం కప్ప బిగించేడు.

అటెండెన్స్ తీస్కోడం పూర్తయేక 'టుడేస్ లెసన్' అని ప్రారంభించగానే '. . . ఈజాన్ రీ ప్రొడక్టరీ సిస్టమాఫ్ ఫ్రాగ్ సర్' అంటూ పూర్తి జేశేడో వెనక బెంచీ విద్యార్థి. .

అందరూ ఒక్కసారిగా ఘొల్లుమన్నవ్వేరు.

రామ్మూర్తి హృదయంలో మళ్ళీ తుఫానురేగింది.

అసలే అర్ధాంగి దగ్గిరలేక, విరహ జ్వాలల్లోమాడి పోతూన్న తరుణంలో ఇటువంటి పాఠమా!

పాఠం చెప్పకపోతే కుర్రాళ్ళు మరింత కట్టుతప్పి పోతారన్న భయంతో మొత్తానికి ఎలాగైతేనేం మొదలెట్టేడు.

కానీ మనసులోనూ, అణువణువులోనూ రాధ ఆమె తాలూకు జ్ఞాపకాలూ నిండి వుండడంమూలాన చార్ట్‌లోని ఫ్రాగ్ రాధ మొహంలా కన్పించసాగింది.

నిగ్రహించుకోడం కష్టంగా ఉంది.

ఏదో చెప్తున్నాడు గానీ ఏం చెప్తున్నాడో తనకే తెలీట్లేదు.

కుర్రాళ్ళు తెగ నవ్వేస్తున్నారు.

జోకులేమన్నా పేలి పోతున్నాయా! ఏమో !

ఎందుకు నవ్వుతున్నారో కూడా తేలీట్లేదు.

చివరికో బుద్ధిమంతుడైన కుర్రాడు తెగించి లేచి 'మీరు కప్పలంగతొదిలేసి మనుష్యులంగతిన్చెప్పుతున్నారు సార్' అని గుర్తుచేస్తున్నట్టుగా హెచ్చరించే వటుకూ అతని వొళ్ళు తనకి తెలిలేదు.

అప్పటికర్థమైంది రామ్మూర్తికి కుర్రాళ్ళలా ఎందుకు పేట్రేగిపోతున్నారో. ఆడపిల్లల మొహాలు సిగ్గుతో ఎందుకంతకందగడ్డలుగా మారిపోతున్నాయో.

ఒక్క నిముషం తనని తాను నిగ్రహించుగుని 'ఇవేళ ప్రాణం బొత్తిగా బాగోలేదు. ఇహపాఠం తీస్కోలేను. ఈ ప్రశ్నలకి సమాధానం రాయండి 'అంటూ కొన్ని ప్రశ్నలు బోర్డుమీద రాసొచ్చి లేబ్‌లోపడ్డాడు.

వర్షపునీటితో నిండిన చెర్లోని కప్పల్లా అతని మనసులో రాధ తాలూకు ఆలోచన్లొకటే రొద బెడ్తున్నాయి.

నూతిలోని కప్పలా అతని మనసు ఆమెతోడి ప్రపంచాన్ని గురించే తప్పమిగతా విషయాల్నిగురించి ఆలోచించట్లేదు.

చిరాగ్గా, అసహనంగా ఈజీ చైర్లో వెనక్కివాలి కళ్ళు మూసుగున్న రామ్మూర్తి.

'టిక్.... టిక్.... టిక్' మంటూ ఏదోశబ్దం వినబడేసరికి ఉలిక్కిపడి లేచాడు.

---

"ఈ ఇబ్బందులు, కష్టాలు ఇలాగే జరిగితే కొన్ని రోజుల తరువాత మనం ముష్కైత్తక తప్పదు." అన్నాడు (గుక్కతిప్పకోకుండా) ఆశావాది.

"ఎవరిని"? అని నిరాశావాది అడిగాడు.

---

వోకుర్రాడు బజార్లో దొరికే రేకు కప్పని నొక్కుతూ ఆడుకుంటూ పోతున్నాడు.

రామ్మూర్తి ఆ కుర్రాణ్ణి పిల్చేడు కిటికిలోంచి వాడు భయపడ్తూ వచ్చి ఎదురుగా నిలబడేడు.

'ఏవిటది.... చేతిలో' గర్జించేడు.

'ఏంలేద్సార్' అంటూ వెనక్కి నక్కాడాకుర్రాడు

రామ్మూర్తి ఆ కుర్రాడి చేతిలోంచి దాన్ని లాక్కొని 'క్లాసొదిలేసి యివ్వావన్న' అంటూ కసిరేడు.

పాపమాకుర్రాడు చేసేదేమీలేక మాస్టారి చేతుల్లో చిక్కుపడిపోయిన తనకప్పవంక దీనంగా చూస్తూ వెళ్ళిపోయేడు.

రామ్మూర్తి ఆ రేకు కప్పవంక ఆప్యాయంగా చూశేడు.

'దేవాంతకుడు' సినిమాలో కాబోలు ఎస్టీరామారావు తన ప్రియురాల్ని పిలవడం కోసం ఇటువంటి దాన్నే ఉపయోగిస్తాడు.

ఈ కప్పలు అంతమంచి పన్నగ్గూడా ఉపయోగిస్తాయన్నమాట.

రామ్మూర్తికీ కోరిక ఎన్నాళ్ళినించో ఉంది మనసులో అటువంటిదోటి కొందామనీ, రాధమ్మ చెవిలో మొగిద్దామనీను.

కానీ యిన్నాళ్ళు తన పెద్ద తనమడ్డురాగా కొనడానికి చిన్నతనమేసి వూరుకున్నాడు.

వోసారి చుట్టూ కలయజూసి ఎవరూ లేరని నిర్ధారించుగున్నాక జేబూలో చేయిపెట్టి నెమ్మదిగా సున్నితంగా ఆ కప్పని నొక్కసాగేడు.

'టిక్.... టిక్.... టిక్....' మంటూ అద్జేస్తూన్న ధ్వని అతని చెవులకెంతో ఆహ్లాదకరంగా వినిపించింది.

స్వయంగా రాధె తన చెవిలో గుసగుస లాడుతున్నట్టుగా భావించి తన్మయత్వంతో కళ్ళుమూసుగున్నాడు.

ఎవరో స్టూడెంట్‌వచ్చి లేపేవరకూ మళ్ళీఅతడు కళ్ళు తెరవలేదు. 'ప్రాక్టికల్స్ తీసుగుంటారా స్సార్' అనడుగుతున్నాడు.

రామ్మూర్తి పూర్తిగా ఈ లోకంలోకి రావడానికి కిష్టపడక సగం మత్తుతో, కళ్ళుగుడా సగమే తెరిచి 'రెంకప్పతో చెప్పు క్రాక్రోచ్‌లు సిద్ధం చేయమని. ఒస్తున్నా'నన్నాడు.

అతను తెల్లబోయి' క్రాక్రోచ్ కాద్సార్.... ఫ్రాగ్ డిసెక్షన్' అన్నాడు.

ఫ్రాగ్ అన్నమాట చెవిని పడగానే పూర్తిగా తెలివొచ్చేసింది రామ్మూర్తికి. ఆ తర్వాత ఆశ్చర్యం గూడా వేసింది.

ఏవిటి వింత నిన్నటినించీను.

కప్పలు ! కప్పలు ! కప్పలు !

ఒహటే కప్పలు !

ఎటు చూసినా కప్పలే !

ఎక్కడ విన్నా కప్పలే !

పాటాల్లోను పలవరింతల్లోనూ గుడా కప్పలే !

ఎక్కడికి పోయినా, ఏం జేసినా, ఈ కప్పలు తనని వదలకండా ముప్పుతిప్పలు పెడ్తున్నాయి.

ఆ పేరు వినగానే రాధ గుర్తుకొచ్చి ఆమెతాలూకు ఆలోచన్లు మాతివరల్ని కరుచుగున్న కప్పల్లా తన్ని వదలట్లేదు.

నిజానికి తన పరిస్థితి ఏ మాత్రమూ బాగోలేదు. ఆమె తనమండి దూరమై రెండ్రోజులే ఐనా ఈ కప్పలమూలంగా రేగే ఆలోచన్లు గుండెల్లో రేగే విరహాగ్ని జ్వాలల్ని మరింత ఎగదోస్తున్నాయి.

కొత్త వయస్సు, కొత్త కోరికలు, క్రొంగొత్త అనుభవాలు ఇవన్నీ కలిసి కలవర పెడ్తూ నిగ్రహాన్ని అంతకంతకూ దిగజార్చేస్తున్నాయి.

అలా ఒంటరిగా కూర్చొని వూహల్లోనైనా కనీసం రాధతో కలిసి నందనవనాల్లో విహరిస్తూ ఉండి పోవాలనుంది.

కానీ తప్పదు.

వరుసగా అన్ని క్లాసులూ తీస్కోకుండా వదిలేస్తే బాగుండదు.

కప్పగంతుల వాలొచ్చి కథాకళీ ఆడతారు.

లేచి వెళ్ళేడు లేబ్‌లోకి.

రామ్మూర్తిని చూస్తూనే ఎండిన చెర్లో నీళ్ళు న్యూసిన కప్పల్లా, అప్పటి వరకూ అక్కడక్కడా వరండాలోనిల్చొని కబుర్లు చెప్పుగుంటూన్న స్టూడెంట్స్ అందరూ బిలబిల్లాడుతూ లోనికొచ్చేరు.

వెంకప్ప డిసెక్షన్‌కి సిద్ధంగా ఉంచిన కప్పన్ని తెచ్చి రామ్మూర్తి కెదురుగా బేసిన్లో పెట్టేడు.

అది పెద్దసైజులో బాగా బలిసి సరిగ్గా ఆవేళ రాధ మొదటిసారిచూసిజడుసుగున్న—కప్పలానేఉంది.

దాన్ని బేసిన్ నీళ్లలోని బోర్డ్‌మీద ఫిక్స్‌చేసి, కత్తులూ కటార్లూ చేత బుచ్చుకోగానే కప్పబదులు రాధ మొహం కనబడి 'అయ్యొయ్యో అవేం భ్రష్టప్పన్లండీ ....' అంటున్నట్లనిపించింది.

అన్యమనస్కంగానే డిసెక్షనంతా పూర్తి జేసి పిన్‌తో పైకెత్తి చూపుతూ 'ఇదిగో స్టమక్' అన్నాడు.

'అది హార్ట్‌సార్' అని వో విద్యార్థి హెచ్చరించే వరకూ అతని కా పరధ్యానం వదల్లేదు.

తీరా చూస్తే అది హార్టే !

అర్ధాంగిని గూర్చి ఆలోచిస్తూ 'డైజెస్టివ్ సిస్టం'నికి బదులు 'హార్ట్‌సిస్టం' తీసవతల పెట్టేడు.

* * *

దీపాల వేళ.

చల్లగాలి కోసం డాబా పిట్టగోడమీద కూచుని పూలు మాలగట్టుగుంటూన్న రాధకి దూరాన్నించి స్పీడుగా సైకిల్ తొక్కుకుంటూ వస్తూన్న వ్యక్తి పరిచితుడుగా తర్జుమా ఐపోయేసరికి కొద్ది పరకాయించి చూసింది.

చూసిన మరుక్షణం ఉలిక్కిపడింది.

మాలకడూతున్న చేతులగ్గూడా మతిబోయింది.

కడూతున్న పూలచెండు నలాగే పట్టుగుని ఒక్క నిమిషంలోడాబాదిగి వీధిగేటు దగ్గరకొచ్చేసింది.

మరునిముషంలో చెమటలు కక్కుతూ ఆయాసంతో రొప్పుతూ రోజుతూన్న రామ్మూర్తి గూడా సైకిల్ దిగేడు గేటు దగ్గర.

'ఏమిటండీ.... మీరిలా.... అర్థాంతరంగా. . .' రాధమ్మకి ఆశ్చర్యంతో ఆ తర్వాత మాటరాలేదు.

'నేను.... నేనొచ్చేశాను రాధా.... నీ కోసం వొచ్చేశేన్నేను....' అంతకంటె ఇంకేమీ మాట్లాడలేక పోయేడు రామ్మూర్తి.

# కప్పలు

యుగాల తర్వాత కల్సుగున్నట్లు ఒకర్నొకరు జూస్కుంటూ మాటామంతీలేకండా ఒకటి రెండు నిముషాలలా నిలబడిపోయేక తామిద్దరూ వీధిలో వున్నామన్న సంగతి గుర్తుకొచ్చి కెవ్వుమంది రాధ.

'రండి. . . .లోపలికి రండి' అంది కంగారుగా గేటు తెరుస్తూ.

'ఆషాడమో. . . ఆవకాయో' అంటూ ఆంక్షలు పెట్టేరుగా, లోనికి రావొచ్చా' అన్నాడు బెరుకుగా.

'ఫర్లేదులెండి. నాన్న కోర్టుపని మీద హైద్రాబాదెళ్లేరు. అమ్మగుళ్ళోకెళ్ళింది. ఇంటో వుంది నేనొక్కర్తినే. ముందు లోపలికి రండి' అంటూలోనికి దారి తీసింది.

రామ్మూర్తి ధైర్యంగా అనుసరించేడు రాధమ్మని.

లోపలికొచ్చి తలుపులు మూస్తూనే రాతిలోంచి బయటపడ్డకప్పలా ఆమె వైపు గెంతేడు. తాళం 'కప్ప'లా కరుచుకు పోయేడు.

'నీకేం అమ్మ నాన్నల ఒళ్ళోగువ్వలా కూచున్నావ్ హాయిగా. నేనెంత నరకం అనుభవిస్తున్నానో దెల్సా. నువ్విటొచ్చేసేక అన్నయొచ్చి అమ్మన్దీసుకుపోయేడు. ఒంటరిగా ఛస్తూపోయేను.పిచ్చివాణ్ణయిపోయేను. కళ్ళు తెరచినా నువ్వే. మూసినా నువ్వే. తిండిలేదు. నిద్ర లేదు. ఏ పనీ చెయ్యబుద్ధికాదు. మెదడు మొద్దుబారి పోయింది. కలలో . . .ఇలలో . . .మనసులో . . మెదడులో . . .అటూ . . .ఇటూ . . ఎడా . . పెడా అంతటానువ్వే. ఇవేళ స్కూలొదిలేక ఇంటికి పోబుద్ధిగాలేదు. దానికి తోడు బస్సులుస్ట్రైక్. ఒళ్ళు మండిసైకిల్‌మీదొచ్చేశాను. . . .'రామ్మూర్తలా చెప్పుకుపోతున్నాడు.

రాధకి నోటమాట రాలేదు. అతని మాటలుగూడా వినబట్టం లేదు.

'నా కోసం వస్తులుండి గూడా పదివైళ్ళుసైకిల్ తొక్కుకుంటూ వచ్చేరా!'

ఆమె కళ్ళకి ఆ రాధాదాసుడు అపరతులసీదాసులా కనబడేడు. పట్టలేని ఆనందంతో, కృతజ్ఞతతోఆమె కళ్ళలో నీళ్ళు తిరిగేయి.

అలా కొంచెంసేపు తనివితీరా చూస్కుంటూ మనస్సువిప్పి మాట్లాడుగున్నాక, స్వల్పంగా అల్పాహారం సేవించి కాఫీ తాగేక హటాత్తుగా తెలివొచ్చి తనెంత"ఘనకార్యం"జేశేడోఅర్థమైందిరామ్మూర్తికి.

దాంతో కంగారు గూడాపుట్టింది.

'హయ్యయ్యో. . .ఇప్పుడెలా మీ అమ్మవొచ్చేస్తే ?'

ఆ మాట విన్నాక రాధగ్గూడా కంగారు పుట్టింది.

'ఏం పన్జేశారండీ మీరు. ఆవిడొచ్చేవేళగూడా ఐందీ . . .'

'నిన్ను తీసుగెళ్లిపోదామనివచ్చేను. అమ్మపది పదిహేను రోజుల తర్వాతగానీ రాదు. మిగతా రోజులు గూడా అక్కడే గడిపేస్తే ఈ ఆషాడంపీడ విరగడైపోతుంది గదా. ఆ విధంగా అమ్మకి పుత్తరంరాస్తాను. మనిద్దరం రేపు మనూరెళ్ళిపోదాం. మీ అమ్మకి నేనొచ్చినట్లు తెలీనీకుండా ఎవరిచేతో కబురుపంపేననిచెప్పి రేపొద్దున్నే బస్టాండుకు ఒక్కదానీ వొచ్చేయ్. ఈ రాత్రికి ఏ హోటల్లోనో వుంటాను. . .ఏం .'

ఎంత కంగారుగా జెప్పేడో అంత కంగారుగానూ విన్న రాధ అయోమయంగా తలూపింది.

'వొస్తాను మరీ ! పొద్దున్నే బస్టాండుకొచ్చేయ్!' అని చివరిసారిగాజెప్పి, చిన్నగా ముద్దుపెట్టి, వెళ్ళడానికి తలుపు తెరిచాడో లేదో . . .పురాణం విన్నొని తిరిగొచ్చిన అన్నపూర్ణమ్మగారు గేటు తీస్తూ అల్లుణ్ణిచూసి అలాగే నిలబడి పోయింది.

ఎటూ తప్పించుగోలేని పరిస్థితుల్లో పాము పాలబడిన కప్పలాకొయ్యబా రిపోయేడురామ్మూర్తి.

> క్రూరమైన ఆషాఢ మాసం కబంధ హస్తాల్లో చిక్కుకుని ఎడబాటుకి గురై విరహ జ్వాలల్లో వేగిపోయే కొంగ్రొత్త జంటలకి — అంకితం.

---

యోగపరచుకోవచ్చునని అన్నాడు. అంతలోగా బినామీ దఖలుకు భూస్వాములు యత్నించవచ్చునని అన్నాడు ఆయన.

**మహావీరుడు సుబ్బారెడ్డి:**

తను నమ్మిన దాని కోసం పోరాడి, వైఫల్యం విరుచుకొని పడినప్పుడు, గుండె చెదరక మాతృ సంస్థను వదలక సరయతన సైనికుడుగా క్రమశిక్షణను పాటించి ఎందరు ఎన్ని దూషణ తిరస్కారాలు కురిపించినా, కందే కాలునిలాగ మింగి మరల ప్రజా సేవకు నడుం కట్టి, కొనవూపిరి వరకు రాష్ట్రహితం కాంక్షించిన కాంగ్రెస్ కురువృద్ధుడు ఉపముఖ్యమంత్రి శ్రీ బొల్లవరపు వెంకటసుబ్బారెడ్డి. ఆయన జూన్ 7 వ తేదీ రాత్రి 8.15 కు గుండె పోటుతో మరణించారు. శ్రీ బి. వి.1903 జులై 1 వ తేదీన పట్టుదలకూ, పౌరుషానికీ పుట్టినిల్లయిన కోయిలకుంట్లలో జన్మించారు. బందరు నోబెల్ కళాశాలలో చదివి 1926లో పట్టభద్రులై,

# హైదరాబాద్ నోట్‌బుక్

(5వ పేజీ తరువాయి)

మద్రాసు న్యాయకళాశాలలో బి. ఎల్. అయి నంద్యాలలో వకాల్తా ప్రారభించారు. కాంగ్రెసు సభ్యులూ అయ్యారు. జిల్లాబోర్డు అధ్యక్షులుగా 1938 లో కాంగ్రెస్ పక్షాన పోటీ లేకుండా ఎన్నికయ్యారు. 1941లో వైయక్తిక సత్యాగ్రహంలోను, క్విట్ ఇండియా ఉద్యమంలోను మూడు నాలుగేళ్లు డిటెన్యూగా వున్నారు. 1955 నుండి శాసనసభ్యులు. 1962 లో శాసనసభ సభాపతిగా ఎన్నికయ్యారు. 1971లో ఉపముఖ్యమంత్రి అయ్యారు. 1972 డిసెంబరులో ప్రత్యేకాంధ్ర రాష్ట్ర ఉద్యమంలో మంత్రివర్గం నుండి రాజీనామా యిచ్చారు. సభాపతిగా వివిధదేశాలు పర్యటించిపెక్కు అంతర్జాతీయ సమావేశాలలో భారత ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించారు. ఎన్ని అభిప్రాయ బేదాలున్నా శ్రీ బి. వి. నాలుగు దశాబ్దాలకుపైగా దేశసేవచేసిన స్వాతంత్ర్య యోధుడన్నది, నిష్కర్షకు, నిష్పక్షపాతానికిపెట్టిన పేరన్నదీ ముమ్మాటికి నిజం.

**ఒక సవరణః**

14—6—1974 నాటి సంచిక హైద్రాబాద్ నోట్‌బుక్‌లో "సురభారతి భవనానికి శంఖుస్థాపన" అన్న విషయం చివర "శ్రీమతి మండలి అనసూయ" అని పొరపాటు దొర్లింది. ఆమె శ్రీమతి వడలి అనసూయ, ఎం. ఎ.

**ఉపశ్రుతి:**

"వక్కొం నరసింహశాస్త్రిగారు 24 గంటలలో సంస్కృత భాగవతం పారాయణం చేసి ముగిస్తారు. తెలుసా?" అన్నాడొక పురాణాభిమాని. "భలే చెప్పినవులే, స్టాఫ్ వాల్యుయేషన్ — కాదు కాదు స్పాట్ వాల్యుయేషన్‌లో మూడు గంటలలో వంద ఏస్సర్ పేపర్లుకరెక్టు చేస్తుండగా చూడడంలేదా?" అన్నాడు ఒక ఆధునికుడు.